మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త



## అయ్యప్పస్వామి స్వర్ణాభరణాల ఊరేగింపు

**సంగారెడ్డి మున్సిపాలిటీ, జనవరి 15, (ప్రభాతవార్త):**
సంక్రాంతిపండుగను పురస్కరించుకుని సంగారెడ్డి జిల్లాకేంద్రంలో ఏనుగు అంబారిపై అయ్యప్పస్వామి స్వర్ణాభరణాలు ఊరేగింపు మహోత్సవం అంగరంగవైభవంగా జరిగింది. శ్రీమణికంఠ అయ్యప్ప ఉత్సవ కమిటీ అధ్యక్షుడు సాహితీ రాముగురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన ఊరేగింపు సంజీవనగర్ హనుమాన్ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరేగింపును జ్యోతిర్వాస్తు విద్యాపీఠం పీఠాధిపతి డా.మహేశ్వరశర్మ సిద్ధాంతి ప్రారంభించారు. ఊరేగింపును పాత బస్టాండ్ శ్రీనివరత్నాలయ దేవస్థానం వరకు కేరళ వాయిద్యాలు, మహిళల కోలాటం, అయ్యప్పస్వాముల ఆటపాటలతో వైభవంగా ఊరేగింపు జరిగింది. ఈమహోత్సవంలో టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, గౌరవ అధ్యక్షుడు జయప్రకాశ్, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, కోశాధికారి విశ్వనాథరావు, ఆలయ కమిటీ సభ్యులు, గురుస్వాములు, భక్తులు మహిళలు పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**హుస్నాబాద్ టౌన్, జనవరి 15, ప్రభాతవార్త:**
హుస్నాబాద్ పట్టణంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో 5వతరగతిలో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపల్ విజయ బుధవారం తెలిపారు. కులం, ఆదాయం, నివాసం, ఆధార్కార్డు ఫోటోలతో మీసేవాకేంద్రంలో రూ.100 చెల్లించి ఫిబ్రవరి 1వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రవేశపరీక్ష ఫిబ్రవరి 23న ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆసక్తిగల విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ విజయ కోరారు.

# అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

**-ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జి మంత్రి శ్రీమతి కొండా సురేఖ**
**-ఉమ్మడి మెదక్జిల్లా కలెక్టర్లతో గూగుల్ మీట్ సన్నాహక సమావేశం**

సంగారెడ్డిబ్యూరో జనవరి 15, ప్రభాతవార్త :
ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా సమర్థవంతంగా కార్యాచరణను అమలు చేయాలని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖామాత్యులు, ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జి మంత్రి శ్రీమతి కొండా సురేఖ కలెక్టర్లను ఆదేశించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రజా సంక్షేమమే పరమావధిగా ఈ నెల 26 నుంచి అమలు చేయనున్న నూతన పథకాలను నిబద్ధతతో అమలు చేసి, ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చాలని మంత్రి సురేఖ సూచించారు. రాజ్యాంగం అమలులోకి వచ్చి 26 జనవరి2025 నాటికి 75 సంవత్సరాలు అవుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, నూతన రేషన్ కార్డుల మంజూరు, ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపు పథకాలను ప్రతిష్టాత్మకంగా అమలు చేసేందుకు నిర్ణయించిన.ఈ నేపథ్యంలో బుధవారం మంత్రి సురేఖ , సంగారెడ్డి,మెదక్ సిద్దిపేట జిల్లాల కలెక్టర్లు వల్లూరు క్రాంతి, రాహుల్ రాజ్,
మిక్కిలినేని మను చౌదరిలతో ఢిల్లీ నుంచి గూగుల్ మీట్ ద్వారా సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, నూతన రేషన్ కార్డుల మంజూరు, ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపుకు సంబంధించిన పథకాల అమలు విధివిధానాలు, లబ్ధిదారుల ఎంపిక, క్షేత్రస్థాయిలో తీసుకుంటున్న చర్యలు తదితర అంశాల పై మంత్రి సురేఖ కలెక్టర్లతో చర్చించారు. రాజకీయ ప్రమేయం లేకుండా, మానవతా దృక్పథంతో పథకాల ప్రయోజనాలు పేద ప్రజలకు అందేలా చర్యలు చేపట్టాలని మంత్రి సురేఖ అధికారులను ఆదేశించారు. ఈ దిశగా ప్రభుత్వ పరంగా సంపూర్ణ సహకారం అందిస్తామని మంత్రి స్పష్టం చేశారు.భూ భారతి పోర్టల్ లో నమోదైన పట్టాదారులు మాత్రమే రైతు భరోసా పథకం కింద అందించే ఆర్థిక సహాయానికి అర్హులని మంత్రి సురేఖ కలెక్టర్లకు స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అమలుకు కుటుంబాన్ని యూనిట్ తీసుకుంటున్నట్లు మంత్రి కలెక్టర్లకు తెలిపారు.ఆయా జిల్లాల్లోని జాబ్ కార్డుల వివరాలను మంత్రి సురేఖ ఆరా తీశారు.ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలులో ఇందిరమ్మ ఇళ్ళ యాప్ ద్వారా గుర్తించిన వారిలో అత్యంత నిరుపేదలుగా గుర్తించిన వారికి మొదటి ప్రాధాన్యతను ఇవ్వాలని సూచించారు. జనవరీ 26 నాటికి లబ్దిదారుల జాబితాను వెల్లడించే విధంగా సన్నద్ధంగా వుండాలని సూచించారు. ఇందిరమ్మ కమిటీలతో సంప్రదించి లబ్దిదారులు ఎంపిక పూర్తి పారదర్శకతతో జరిగేలా కార్యాచరణను అమలు చేయాలని కలెక్టర్లను మంత్రి నిర్దేశించారు. అర్హత వున్న ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు మంజూరు కావాలని మంత్రి కలెక్టర్లకు సూచించారు. కొత్తగా అమలు చేయనున్న పథకాలకు సంబంధించి ఎమ్మెల్యేలు హరీష్ రావు, సునీతా లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి తదితర ప్రజా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సురేఖ సమాధానమిచ్చారు. పథకాలు అమలు నిరంతర ప్రక్రియని, అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాల ప్రయోజనాలు దక్కుతాయని మంత్రి సురేఖ వారికి స్పష్టం చేశారు. నూతన పథకాల అమలుకు సంబంధించి మండల స్థాయిలో గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేసి ప్రజల సందేహాలను తీర్చాలని మంత్రి కలెక్టర్లకు సూచించారు. నియోజకవర్గాల స్థాయిలో వాట్సప్ గ్రూపులు ఏర్పాటు చేసి, తనను చేర్చాలని, దీంతో పథకాల అమలు తీరును తెలుసుకోవడానికి తనకు అవకాశముంటుందని మంత్రి సురేఖ ప్రజాప్రతినిధులకు కోరారు. ఈ వీడియో సమీక్ష సమావేశంలో ఉమ్మడి మెదక్ జిల్లాకు పలువురు ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, ఉమ్మడి మెదక్ జిల్లా నోడల్ ఆఫీసర్ హరి చందన, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, పిడి డిఆర్డిఏ జ్యోతి, జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, జడ్పీ సీఈవో జానకి రెడ్డి, పిడి హౌసింగ్ చలపతిరావు రెవిన్యూ డివిజనల్ అధికారులు సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సిఎంను కలిసిన మండల నాయకులు



సిఎం రేవంత్రెడ్డికి పూల మొక్కను అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**బెజ్జంకి, జనవరి 15, ప్రభాతవార్త:**
సంక్రాంతిపండగ సందర్భంగా హైదారాబాద్లోని సిఎం రేవంత్రెడ్డిని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణను బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఒగ్గు దామోదర్, మండల పార్టీ అధ్యక్షులు ముక్కిస రత్నాకర్రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అఫీస్ ఇంచార్జి గోవు మల్లారెడ్డి, కొలగాని మహేష్, ఎఎంసి వైస్ చైర్మన్ చిలువేరు శ్రీనివాస్రెడ్డి, మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎం.డి.జహంగీర్లు మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందించి శుభాకాంక్షలు తెలిపారు.

## ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని కోతలు విధించకుండా అమలు చేయాలి

**-మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్రావు**

**సిద్ధిపేట, జనవరి 15, ప్రభాతవార్త ప్రతినిధి:**
ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని కోతలు విధించకుండా అమలు చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్రావు సర్కార్ను డిమాండ్ చేశారు. ఉమ్మడి మెదక్ జిల్లా నాయకులతో బుధవారం వర్చువల్గా నిర్వహించిన సమీక్షాసమావేశంలో ఆయన మాట్లాడారు. కోతలులేకుండా రైతుకూలీలందరికీ రూ.12వేలు ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో 50లక్షల ఈజీఎస్ కార్డులు ఉంటే కోటి రెండులక్షలమంది ఉపాధి హామీకూలీలుగా పనిచేస్తున్నారని తెలిపారు. కూలీపనులకు వెళ్లేవారిలో ఎస్సీ,ఎస్టీ,బిసి రైతులే ఎక్కువగా ఉన్నారని తెలిపారు. రాష్ట్రంలో కోటి 2లక్షలమంది వ్యవసాయకూలీలు ఉపాధిహామీపథకంలో పని చేస్తున్నారని తెలిపారు. గుంటభూమి ఉన్న రైతులను ఉపాధిహామీకూలీలుగా గుర్తించం అని ప్రభుత్వం చెప్పడం సరికాదన్నారు. ఒక్కసెంటు భూమి ఉన్నా కూలీకాదని ప్రభుత్వం చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఉపాధిహామీపథకంలో ఈయేడు 20రోజుల పనిదినాలు ఉంటేనే కూలీగా గుర్తింపు అనే నిబంధన కూడా సరికాదన్నారు. గుంట, రెండుగుంటలు ఉన్న రైతులు రైతుభరోసా తీసుకోవడం వలన కూలీలకు ఇచ్చే రూ.12 వేలు నష్టపోతారని..ఇలాంటి రైతులకు రైతుభరోసా కాకుండా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లబ్దిదారులుగా గుర్తించాలన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో ఈజీఎస్ నిబంధన విధించకుండా అమలు చేయాలన్నారు. గ్రామసభలు పెట్టి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో మంజూరై పూర్తి కాని ఇళ్లకు నిధులు మంజూరు చేయాలన్నారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన కేంద్ర సహాయమంత్రి



బాధిత కుటుంబీకులను పరామర్శిస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్

**హుస్నాబాద్ రూరల్, జనవరి 15, ప్రభాతవార్త:**
హుస్నాబాద్పట్టణంలోని బిజెపి సీనియర్నాయకుడు చిట్టి గోపాల్రెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయులు బొంగోని లక్ష్మయ్య మరణించడంతో కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ బుధవారం బాధిత కుటుంబీకులను పరామర్శించి ఓదార్చారు. రాష్ట్రీయ స్వయంసేవక్సంఘ్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా పూర్వప్రచారక్ చిట్టి గోపాల్రెడ్డి మరణం బాధాకరమన్నారు. సామాజిక సేవాకార్యక్రమాల్లో నిరంతరం గోపాల్ రెడ్డి ముందుండేవారన్నారు. హిందూధర్మ రక్షణకోసం నిరంతరం పరితపించే గోపాల్రెడ్డిమరణం తీరనిలోటన్నారు. గోపాల్రెడ్డి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అలాగే బిజెపి సీనియర్ నాయకులు బొంగోని శ్రీధర్ తండ్రి విశ్రాంత ఉపాధ్యాయులు బొంగోని లక్ష్మయ్య అనారోగ్యంతో మరణించడంతో బాధిత కుటుంబీకులను పరామర్శించి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఆయన వెంట పార్టీనాయకులు గంగాడి మోహన్రెడ్డి, కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, కొట్టే మురళికృష్ణ, లక్కిరెడ్డి తిరుమల, దొడ్డి శ్రీనివాస్, సంపత్ నాయక్, మహేందర్రెడ్డి, సతీష్, శంకర్బాబు, రాజేంద్రప్రసాద్, సమ్మయ్య, అనంతస్వామి, సంతోష్, శ్రీనివాస్, జేరిపోతుల ఎల్లయ్య, ర్యాకం రేణుక, సరిత తదితరులు పాల్గొన్నారు.

## సంగారెడ్డిలో ఘనంగా సంక్రాంతి సంబరాలు

**సంగారెడ్డి మున్సిపాలిటీ, జనవరి 15, ప్రభాతవార్త:**
సంక్రాంతిపండుగను పురస్కరించుకొని స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం కార్యకర్తలతో కలిసి ఉత్సాహంగా ఎమ్మెల్యే పతంగులు ఎగరవేశారు. సంగారెడ్డిజిల్లా నియోజకవర్గ ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులపక్షపాతి అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం, రైతులను అన్ని విధాలుగా మోసంచేస్తోందని అన్నారు. ఈకార్యక్రమంలో మాజీ సిడిసి చైర్మన్ విజేందర్రెడ్డి, పట్టణ కార్యదర్శి నర్సింలు, జివి శ్రీనివాస్, విఠల్, శ్రవణ్రెడ్డి, వాజిత్, అజిమ్, చింటు తదితరులు పాల్గొన్నారు.

**జగ్గారెడ్డి ఆధ్వర్యంలో..**
సంగారెడ్డిలోని రామ్మందిర్వద్ద రామ్మందిర్ భజనమండలి కార్యకర్తలు, రామ్మందిర్ యువసేనతో కలసి టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పతంగులు ఎగరవేశారు. ఆయనతోపాటు నియోజవర్గం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పతంగులు ఎగురవేస్తున్న జగ్గారెడ్డి

# అధికారులు సమన్వయంతో పని చేయాలి

**జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్**



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్

**సిద్ధిపేట, జనవరి 15, ప్రభాతవార్త ప్రతినిధి:**
సిఎం రేవంత్రెడ్డి, జిల్లా ఇంచార్జి మంత్రి కొండా సురేఖ ఆదేశాల మేరకు జిల్లాలో రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయభరోసా, కొత్త రేషన్ కార్డులు జారీ, ఇందిరమ్మ ఇళ్లు అర్హులైన లబ్దిదారులకు అందించేందుకు జిల్లా యంత్రాంగం ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారమే అందివ్వాలని జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టరేట్లో రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయభరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లపై జిల్లాస్థాయి సన్నాహక సమావేశంన బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందుగా అవసరమైన బృందాలను ఏర్పాటుచేసి క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలన్నారు. ఎంపికచేసిన సిబ్బంది గ్రామాల్లో, మున్సిపాలిటీల్లో ఫీల్డ్ వెరిఫికేషన్ అత్యంత పారదర్శకంగా వేగంగా నిర్వహించాలన్నారు. ఫీల్డ్ వెరిఫికేషన్ పూర్తి అయిన తర్వాత లబ్దిదారుల ముసాయిదా జాబితాను తయారుచేయాలన్నారు. గ్రామాల్లో, మున్సిపాలిటీలలో ప్రజాప్రతినిధులు, అధికారుల సమక్షంలో సభలు నిర్వహించి లబ్దిదారుల జాబితా, ప్రభుత్వం చేపడుతున్న పథకాలపై చర్చించాలన్నారు. గణతంత్ర దినోత్సవం రోజు లబ్దిదారులకు పత్రాలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. అధికారులు సమన్వయంతో అర్హులైన ఏ ఒక్క లబ్దిదారుని పేరు మిస్కాకుండా పనిచేయాలని అధికారులను ఆదేశించారు. సమీక్షా ఆర్డీఓ సదానందం, చంద్రకళ, డీఆర్డీఏ పిడి జయదేవ్ ఆర్యా, డిఎస్ఓ తనూజ, డిఎఓ రాధిక, హౌసింగ్ ప్రోగ్రామ్ ఆఫీసర్ దామోదర్ రాం, మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపిడిఓలు తదితరులు పాల్గొన్నారు.

# అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్

**-అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందజేయాలి**
**-జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు**

**సంగారెడ్డి మున్సిపాలిటీ, జనవరి 15, ప్రభాతవార్త:**
తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ ఇళ్లు, రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయభరోసా, నూతన రేషన్కార్డుల మంజూరు పథకాలు అర్హులైనపేదలకు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లాకలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. బుధవారం సంగారెడ్డి కలెక్టర్ కార్యాలయం నుండి జిల్లాలోని, తహసీల్దార్లు, ఎంపిడివోలు, వ్యవసాయ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా అధికారులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడారు. పథకాల లబ్దిదారుల ఎంపికలో ఏవిధమైన ఫిర్యాదులు రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సర్వేలో పెండింగ్ ఉన్న లబ్దిదారుల వివరాలు సేకరించి తుది జాబితాను ఖరారు చేయాలని అధికారులకు సూచించారు. గతంలో నిర్మించి లబ్దిదారులకు అందజేయని రెండు పడకగదుల ఇళ్లు వెంటనే లబ్దిదారులకు అందజేసేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. అసంపూర్తి ఇళ్లనిర్మాణాలు వేగవంతంగా పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. గ్రామాలు,వార్డులలో గ్రామసభలునిర్వహించి లబ్దిదారుల వివరాలను చదివి, వినిపించి లబ్దిదారులను ఎంపిక చేయాలన్నారు. 2025 జనవరి 26న రాష్ట్రప్రభుత్వం రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, నూతన రేషన్కార్డులు అందించే కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమాల విజయవంతం కోసం రెవెన్యూ పంచాయతీరాజ్ వ్యవసాయశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. భూభారతిపోర్టల్లో నమోదైన పట్టాదారులుమాత్రమే రైతుభరోసా పథకంకింద అందించే ఆర్థికసహాయానికి అర్హులని కలెక్టర్ స్పష్టంచేశారు. మండలస్థాయిలో ఈపథకం అమలుకు నోడల్ ఆఫీసర్ల సేవలు వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసాపథకం అమలుకు కుటుంబాన్ని యూనిట్గా తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. నిబంధనలప్రకారం ఉపాధిహామీ కింద కనీసం 20 రోజులు పనిచేసినవారిని లబ్దిదారులుగా గుర్తించాలని కలెక్టర్ సూచించారు. జనవరి 26నాటికి జిల్లాలోని మున్సిపాలిటీలు అన్నిగ్రామ పంచాయతీలలో లబ్దిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి కావాలన్నారు. ఈవీడియో సమీక్షాసమావేశంలో, అదనపుకలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, పిడి డిఆర్డిఏ జ్యోతి, జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, జడ్పీ సిఈవో జానకిరెడ్డి, పిడి హౌసింగ్ చలపతిరావు, రెవిన్యూ డివిజనల్ అధికారులు సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు

# కాంగ్రెస్ హయాంలో పేదల సంక్షేమానికి పెద్దపీట

**-డిసిసి అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి**



సిసి రోడ్డు నిర్మాణపనులను ప్రారంభిస్తున్న తూంకుంట నర్సారెడ్డి

**వర్గల్, జనవరి 15, ప్రభాతవార్త:**
పేదలసంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నట్లు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. బుధవారం వర్గల్మండలకేంద్రంలో రూ.25లక్షల వ్యయంతో సిసిరోడ్డు నిర్మాణపనులను నియోజకవర్గ కాంగ్రెస్ ప్రచారకమిటీ చైర్మన్ నిమ్మ రంగారెడ్డి, మాజీ ఎంపిపి మోహన్, మాజీ జెడ్పిటిసి ప్రభుదాస్గౌడ్, మాజీసర్పంచ్ లక్ష్మీనారాయణలతోకలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా నర్సారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు 6 గ్యారంటీలు అమలు చేస్తుండగా, త్వరలోనే అర్హులైన పేదలు అందరికీ ఇంటి నిర్మాణాలు చేపడుతున్నట్లు స్పష్టంచేశారు. ముఖ్యంగా రైతు సంక్షేమానికి పెద్దపీటవేస్తూ అన్నదాతను ఆర్థికంగా ప్రోత్సహిస్తుండగా, పండించిన పంటకు గిట్టుబాటుధర కల్పించడంతోపాటు నేరుగా కొనుగోలు చేస్తున్న ఘనత సిఎం రేవంత్రెడ్డికే దక్కిందని తెలిపారు. రూ.2 లక్షల పంట రుణమాఫీని ఏకకాలంలో వర్తింపజేసి రైతులను రుణవిముక్తి చేసిన సిఎం రేవంత్రెడ్డికి రుణపడి ఉండాలని కోరారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, రూ.500కే వంటగ్యాస్ సిలిండర్ పంపిణీ, 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ సరఫరా, రూ.5లక్షల వ్యయంతో ఇంటి నిర్మాణం వంటి సాహసోపేత నిర్ణయాలతో కాంగ్రెస్ ప్రభుత్వం అన్నిరంగాల్లో ముందుకెళ్తున్నట్లు వివరించారు. ఈకార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సందీప్రెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రాజశేఖర్రెడ్డి, నాయకులు గజ్వేల్ ప్రవీణ్గౌడ్, గోవర్ధన్రెడ్డి, శ్రీనివాస్రెడ్డి, బాల్రెడ్డి, మహేందర్గౌడ్, కిషన్గౌడ్, గణేష్, ఎల్లారావు, రమేష్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

## మండలంలో జోరుగా ఇసుక అక్రమరవాణా



డంప్ చేసిన ఇసుక

**బెజ్జంకి, జనవరి 15, ప్రభాతవార్త:**
మండలంలో ఇసుక అక్రమరవాణా ఇసుక మాఫియాదారులకు కాసులపంట కురిపిస్తుంది. మండలపరిధిలోని తోటపల్లి, గాగిల్లాపూర్ గ్రామశివారులో గల మోయతుమ్మెద వాగు నుంచి రాత్రి సమయాల్లో ఇసుకను ట్రాక్టర్ల సహాయంతో అక్రమంగా తరలిస్తూ అందినకాడికి దండుకుంటున్నారు. పగటి సమయంలో ఇళ్లమధ్యలో రెండు,మూడు ట్రిప్పుల మేరకు ఇసుకను నిల్వ చేస్తూ రాత్రి సమయాల్లో మిని టిప్పర్, మ్యాక్స్ పికప్ వంటి వాహనాల సహాయంతో పట్టణాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇళ్ల మధ్యలో నిల్వచేసిన ఇసుకను ఇంటినిర్మాణం నిమిత్తం నిల్వచేశామని చెబుతూ పట్టణాలకు తరలిస్తున్నా, అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఇది ఇలా ఉండగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను నడుపుతున్న డ్రైవర్లకు కనీస అవగాహనలేకుండా పరిమితికి మించిన అధిక వేగంతో వాహనాలను నడుపుతూ గ్రామస్థులను, బాటసారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాకు కళ్లెం వేయాలని కోరుతున్నారు.

## దొంగల అరెస్టు - రిమాండ్

**చిన్నశంకరంపేట, జనవరి 15, ప్రభాతవార్త:**
పరిశ్రమలో ఇనుమును దొంగలించిన సంఘటన చిన్నశంకరంపేటలో బుధవారం చోటుచేసుకుంది. రామాయంపేట సిఐ వెంకటరాజాగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం... చిన్నశంకరంపేట పట్టణశివారులో ఉన్న హరీష్ స్టీల్, ట్యూబ్స్ పరిశ్రమ భవన నిర్మాణ పనులను చేపడుతున్నారు. ఈక్రమంలో పరిశ్రమగదిలో ఉంచిన ఇనుప గేర్రాడ్డును గుర్తు తెలియని వ్యక్తులు 10వ తేది శుక్రవారం ప్రహరీ గోడను కూల్చి ఎత్తుకెళ్లారు. చిన్నశంకరంపేట పట్టణానికిచెందిన రమేష్, రామచంద్రం, సురేష్, నాగరాజు, బాబులు దొంగలించిన ఇనుప గేర్రాడ్డును చిన్నశంకరంపేట కేంద్రానికి చెందిన లింగం వ్యవసాయ పొలం వద్ద దాచిపెట్టి బుధవారం ఇనుప గేర్రాడ్డును అమ్మడానికి తీసుకెళ్లే సమయంలో ఎస్ఐ నారాయణగౌడ్ నిందితులను పట్టుకొని స్థానిక పోలీస్స్టేషన్కు తరలించారు. నిందితులను అరెస్టుచేసి రిమాండ్కు తరలించినట్లు సిఐ తెలిపారు.

## రోడ్డు కిందకి దూసుకెళ్లిన లారీ లారీ డ్రైవర్కు గాయాలు

**చిన్నశంకరంపేట, జనవరి 15, ప్రభాతవార్త:**
ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని తప్పించబోయి లారీ రోడ్డు కిందకి దూసుకెళ్లిన సంఘటన మండలకేంద్రమైన చిన్నశంకరంపేటలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... చిన్నశంకరంపేట పట్టణశివారులో ఉన్న ఓ పరిశ్రమలో సరుకును దింపి లారీ చేగుంట వైపునకు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి రోడ్డుపక్కన ఉన్న చెట్టును ఢీకొట్టి రోడ్డుకిందకి దూసుకెళ్లింది. ఈప్రమాదంలో లారీ డ్రైవర్ సల్మాన్కు గాయాలయ్యాయి. స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా, పోలీసులు వెంటనే సంఘటన స్థలాన్ని పరిశీలించి డ్రైవర్ను ఆసుపత్రికి తరలించారు.

## గ్రామసభల్లోనే లబ్దిదారుల ఎంపిక

**-మండల ప్రత్యేకాధికారి వినయ్కుమార్**

**జగదేవ్పూర్, జనవరి 15, ప్రభాతవార్త):**
తెలంగాణ రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా సంక్షేమపథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళడానికి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించాలని జగదేవ్పూర్ మండల ప్రత్యేకాధికారి వినయ్ కుమార్, ఎంపిడిఓ బి.యాదగిరిలు అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పంచాయతీకార్యదర్శులు, ఉపాధిహామీసిబ్బంది, ఎంపిడిఓ కార్యాలయసిబ్బంది, వ్యవసాయ, రెవెన్యూశాఖల అధికారులతో సంక్షేమపథకాల లబ్దిదారుల ఎంపికపై సమీక్షాసమావేశం నిర్వహించారు. గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించేందుకు వ్యవసాయ, రెవెన్యూ, పంచాయతీశాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి గ్రామసభలను విజయవంతం చేసి 24లోపు అర్హులను గుర్తించాలని మండల ప్రత్యేకాధికారి వినయ్కుమార్ అన్నారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణమోహన్ రావు, మండలపంచాయతీ అధికారి ఎండి.ఖాజామొయినొద్దీన్, మండల వ్యవసాయాధికారి యు.వసంతరావు, సూపరింటెండెంట్ ఆంజనేయులు, పంచాయతీకార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది, వ్యవసాయ విస్తరణాధికారులు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఎంపిడిఓ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి వినయ్కుమార్

# గజ్వేల్ అంటేనే క్రీడలకు నిలయం

-ఎంఎస్ఎస్ఓ అధ్యక్షుడు బుర్జుకింది ప్రశాంత్‌రెడ్డి



ప్రథమస్థానంలో నిలిచిన జట్టుకు బహుమతి ప్రదానం చేస్తున్న ప్రశాంత్‌రెడ్డి

**గజ్వేల్, జనవరి 15 (ప్రభాతవార్త):**
గజ్వేల్ అంటేనే క్రీడలకు నిలయమని దిలాల్‌పూర్ గ్రామానికిచెందిన మైనంపల్లి సేవాసమితి ఆర్గనైజేషన్ అధ్యక్షుడు బుర్జుకింది ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం గజ్వేల్ పట్టణంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలకు బహుమతులు పంపిణీచేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గత నాలుగురోజుల నుండి మైనంపల్లి సేవాసమితి ఆర్గనైజేషన్ ద్వారా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించామని, క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా తగుజాగ్రత్తలు తీసుకున్నామన్నారు. మైనంపల్లి హనుమంతరావు పుట్టినరోజు సందర్భంగా నిర్వహించిన క్రికెట్ టోర్నీలో 24జట్లు పాల్గొన్నాయని, నాలుగు రోజులనుండి క్రికెట్‌పోటీలు జరుగుతున్నాయన్నారు. గజ్వేల్ టిసిఏ అధ్యక్షుడు హరిచంద్రప్రసాద్ టోర్నమెంట్ నిర్వహణను చూసుకోవడం అభినందనీయమన్నారు. రానున్న రోజుల్లో గజ్వేల్ నుండి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికకావాలని ఆకాంక్షించారు. మైనంపల్లి హనుమంతరావు పలు సామాజిక సేవాకార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటారని, ఎవరికైనా అనుకోని సమస్యలు ఎదురైతే మైనంపల్లి హనుమంతరావు సేవాసమితి ఆర్గనైజేషన్‌కు తెలియజేస్తే మా సహాయసహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. అనంతరం టోర్నమెంట్‌లో ప్రథమబహుమతి ఛత్రపతి శివాజీ జట్టుకు మైనంపల్లి హనుమంతరావు సేవాసమితి అధ్యక్షుడు ప్రశాంత్‌రెడ్డి బహుమతి ప్రదానం చేయగా ద్వితీయబహుమతి లెవన్‌స్టార్ జట్లు గెలుపొందగా వారికి కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకుడు గాడిపల్లి అనూఫ్ అందజేశారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మైనార్టీ రాష్ట్రనాయకుడు మహ్మద్‌ఎక్బాల్, రాజు, పంజాలరవిగౌడ్, బంగారురెడ్డి, గజ్వేల్ నియోజకవర్గ యువజనకాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సమీర్, సాయి, లతీఫ్, కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## శ్రీమల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలు

**నర్సాపూర్, జనవరి 15, ప్రభాతవార్త:**
నర్సాపూర్ మండలపరిధిలోని గొల్లపల్లిగ్రామంలో గత నాలుగురోజులుగా శ్రీకేతకి భ్రమరాంబిక మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలు ఆలయ నిర్మాణ దాత నిర్వాహకులు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నియమనిష్ఠలతో ఘనంగా జరిగాయి. శ్రీమల్లికార్జున బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరిరోజున రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నాలుగు రోజులపాటు శ్రీకేతకి భ్రమరాంబిక మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలు ఎంతో ఘనంగా ముగిశాయి. ప్రతిరోజు వచ్చిన భక్తులకు, ప్రజలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించగా భక్తులందరూ అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈకార్యక్రమంలో ఆలయపూజారి వేదపండితులు హరిప్రసాద్‌శర్మ, ఆలయ నిర్మాణదాత బ్రహ్మోత్సవాల నిర్వాహకులు వాల్దాస్ రాధా మల్లేష్‌గౌడ్‌తోపాటు గ్రామ మాజీసర్పంచ్ బోయిని కృష్ణ, కొత్త రవీందర్ గుప్తా, గ్రామపెద్దలు విజయ్‌కుమార్‌గుప్తా, నవీన్‌గుప్తా, వాల్దాస్ అరవింద్‌గౌడ్, రాములుగౌడ్, గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.

## వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



చేర్యాలలో వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

**చేర్యాల, జనవరి 15, ప్రభాతవార్త:**
వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని చేర్యాల సిఐ శ్రీను, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ క్రిస్టోఫర్ తెలిపారు. బుధవారం జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలలో భాగంగా చేర్యాల పట్టణంలోని అంగడి బజార్ వద్ద ఆటోడ్రైవర్లకు, ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్, రోడ్డు నిబంధనలు పాటించి వాహనాలు నడపాలని సూచించారు. రోడ్డు ప్రమాదంలో జరగరానిదేదైన సంఘటనలు జరిగితే ఆకుటుంబం రోడ్డునపడే పరిస్థితి ఉందని తెలిపారు. మానవతప్పిదం వల్లే రోడ్డుప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. నాలుగుచక్రాల వాహనదారులు సీట్‌బెల్ట్ ధరించాలని, మద్యంసేవించి వాహనాలు నడపొద్దని తెలిపారు. ఆటోలల్లో కూడా పరిమితికిమించి ప్రజలను ఎక్కించుకోవద్దన్నారు. రాంగ్‌రూట్లో వాహనాలునడిపి ఇతరులకు హాని కలిగించొద్దన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో చేర్యాల ఎస్సై నీరేష్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

**ధూళిమిట్టలో...**
జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలలో భాగంగా ఎస్ఐ షేక్ మహబూబ్ సిబ్బందితో కలిసి మద్దూరుమండలంలోని వల్లంపట్లగ్రామంలో వాహనదారులకు, ఆటోడ్రైవర్ల, ప్రజలకు ట్రాఫిక్‌నిబంధనలపై అవగాహన కల్పించారు. ప్రతి వాహనాదారుడు వాహనాలపత్రాలతో పాటు డ్రైవింగ్ లైసెన్సులను కలిగి ఉండాలని సూచించారు.

## పట్టణ ప్రజలు సర్వేకు సహకరించాలి



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య

**గజ్వేల్, జనవరి 15, ప్రభాతవార్త:**
ప్రజాపాలనలో భాగంగా నేటినుండి నూతన రేషన్‌కార్డుల సర్వే గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో మొదలువుతుందని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య పేర్కొన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో సరేచేసే సిబ్బందికి సలహాలు, సూచనలు ఇవ్వడం జరిగిందన్నారు. పట్టణప్రజలు సర్వేకు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈసర్వే కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్, ఏసి మేనేజర్, మెప్మా సిబ్బంది, ఆర్‌పిలు పాల్గొననున్నట్లు తెలిపారు.

## 18న నవోదయ ప్రవేశ పరీక్ష

**వర్గల్, జనవరి 15 (ప్రభాతవార్త):**
నవోదయ విద్యాలయాల్లో 6వ తరగతిలో ప్రవేశానికి గానూ ఈనెల 18వ తేదీన ప్రవేశపరీక్ష నిర్వహించడం జరుగుతుందని వర్గల్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ డి.రాజేందర్ పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 27 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ప్రవేశపరీక్షకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. విద్యార్థి పుట్టినతేదీ లేదా రిజిస్ట్రేషన్ నెంబర్ ద్వారా హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు.

## రోడ్డు నిబంధనలపై వాహనదారులకు అవగాహన



ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎఎస్ఐ జగదీశ్వర్

**కొండపాక, జనవరి 15, ప్రభాతవార్త:**
జాతీయరోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా బుధవారం కుకునూరుపల్లి ఎఎస్ఐ జరదీశ్వర్ తనసిబ్బ ందితో కలిసి మండలకేంద్రంలోని కుకునూరు పల్లి బస్‌స్టాండ్‌వద్ద ఆటోడ్రైవర్లకు, వాహనదారులకు, యువకులకు ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డునిబంధనలు గురించి వివరించారు. ప్రతి వాహన దారుడు తప్పకుండా నిబంధనలు పాటించాలని సూచించారు. మద్యం సేవించి ఆటోలునడపవద్దని, పరిమితికిమంచి ప్యాసింజర్‌లను ఎక్కించుకో వద్దన్నారు. వాహనాలకు సంబంధించిన కాగితాలను డ్రైవింగ్‌లైసెన్, ఇన్సూరెన్స్, వాహనానికి సంబంధించిన డాక్యుమెంట్స్ ఎప్పటికీ వాహనదారులు తన దగ్గరే ఉంచుకోవాలని సూచించారు.

## నర్సాపూర్‌లో సంక్రాంతి సంబరాలు

**నర్సాపూర్, జనవరి 15, ప్రభాతవార్త:**
నియోజకవర్గ కేంద్రమైన నర్సాపూర్‌పట్టణంతోపాటు మండలపరిధిలోని గ్రామాల్లో మంగళవారం మకరసంక్రాంతి పండుగను ప్రజలు అంగరంగ వైభవంగా ఘనంగా జరుపుకున్నారు. ఆనందోత్సాహాలతో మకరసంక్రాంతి పండుగను మహిళలు యువకులు చిన్నలు పెద్దలు జరుపుకున్నారు. ఈమేరకు నర్సాపూర్‌పట్టణంతోపాటు గ్రామాల్లో కూడా ఈసంబరాలను అంగరంగ వైభవంగా ఆనందోత్సవాలతో జరుపుకున్నారు.

## విజేతలకు బహుమతుల అందజేత

**కొముర‌వెల్లి, జనవరి 15, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని కిష్టంపేటగ్రామంలో పంజాల మల్లేశంగౌడ్ ఆధ్వర్యంలో సంక్రాంతిపండుగసందర్భంగా యువకులకు క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. పోటీలలో గెలుపొందినజట్లకు మొదటిబహుమతిగా రూ.10వేలు రెండోబహుమతిగా రూ.5వేలు అందించారు. అలాగే మహిళలకు ముగ్గులపోటీలు నిర్వహించారు. పోటీల్లోగెలుపొందిన విజేతలకు మొదటిబహుమతిగా రూ.2వేలు, ద్వితీయబహుమతిగా రూ.1500, తృతీయబహుమతిగా రూ.1000, నాల్గోబహుమతిగా రూ.500 అందించారు. కార్యక్రమంలో పొన్నం చంద్రయ్యగౌడ్, లింగంపల్లి

## క్రికెట్ గోల్డ్ కప్‌ను అందుకున్న నాగర్‌కర్నూర్ జట్టు



కిజర్‌యాపై గోల్డ్ కప్‌ను అందుకుంటునన నాగర్‌కర్నూర్ ఆలి సిసి జట్టు

**జహీరాబాద్, జనవరి 15, ప్రభాతవార్త:**
గత 10 రోజుల పాటు క్రీడాకారుల, యువకుల కేరింత మధ్య పట్టణంలోని బాగారెడ్డి స్టేడియంలో జరిగినన ఖిజర్ యాపై గోల్డ్ కప్-3 టౌర్నమెంట్‌లో నాగర్‌కర్నూర్ డాలి సిసి జట్టు విజయకేతకం ఎగరేసి కప్పును కైవశం చేసుకుంది. ముగింపు పోటీలో డాలి సిసి నాగర్ కర్నూల్ జట్టు, జహీరాబాద్ నేషనల్ కలీం జట్టు తలపడగా రసవత్తంగా సాగిన ఫైనల్ పోటీలో జహీరాబాద్ జట్టుపై నాగర్‌కర్నూర్ జట్టు 3 పరుగుల తేడాతో విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ చేసి డాలి సిసి జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 167 పరుగులకు ఆల్‌అవుట్ కాగా 168 పరుగుల లక్ష్యంతో బరిల దిగిన జహీరాబాద్ జట్టు 20 ఓవర్లలో 164 పరుగుల చేసి ఆల్‌అవుట్ కావడంతో డాలి సిసి జట్టు జయకేతనం ఎగరేసింది. టోర్నీ కప్పును కైవశం చేసుకున్న డాలి సిసి జట్టుకు 6 లక్షల 11వేల111 రూపాయల చెక్కుతో పాటు విన్నర్ ట్రోపిని, రన్నర్‌గా నిలిచిన జహీరాబాద్ జట్టుకు 3 లక్షల 55వేల 555 రూపాయల చెక్కును నిర్వాహకులకు నిర్వాహకులు ఖిజర్ యాపై ముఖ్య అతిథులతో కలిసి అందచేశారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన పార్టీ అధ్యక్షులు రామచంద్రయాదవ్, నిర్వాహకులు ఖీజర్‌యాపై, సెట్విన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, టిఎస్ఐడిసి మాజీ చైర్మన్ మహ్మద్ తన్వీర్, ఆర్గనైజింగ్ కమిటి చైర్మన్ రాములునేత, మాజీ ఎంపిటిసి సభ్యులు దేశెట్టి పాటిల్, నాయకులు శుక్లవర్ధన్‌రెడ్డి, నర్సింహారెడ్డి, శ్రీనివాస్ యాదవ్, ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్ మక్సుద్ అలీ, స్టాండింగ్ ప్రెసిడెంట్ పబ్బతి సంతోష్ కుమార్, మీడియా ఇంచార్జి సయ్యద్ మహబూబ్ అలీ, అబ్దుల్లా సిద్దికి, ఆదమ్ యాపై, అబూద్‌యాపై, ఆధిల్ యాపై, విజయ్ రాథోడ్, పబ్బది రాకేష్, సంగమేశ్వర్, తదితరులు పాల్గొన్నారు. గత 10 రోజులు పట్టణం క్రీడాకారులు, యువకులతో సందడిగా మారింది.

## ఏటిగడ్డ కిష్టాపూర్‌లో ఘనంగా ముగ్గుల పోటీలు

**గజ్వేల్ టౌన్, జనవరి 15, ప్రభాతవార్త:**
గజ్వేల్‌పట్టణంలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీ ఏటిగడ్డ కిష్టాపూర్‌గ్రామంలో ఏఎంసి డైరెక్టర్ వై.నర్సింహారెడ్డి, గ్రామయువత ఆధ్వర్యంలో ముగ్గులపోటీలు నిర్వహించడం జరిగింది. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, గజ్వేల్ మాజీఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, ఏఎంసి చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి, వైస్‌చైర్మన్ సర్దార్‌ఖాన్, ఏఎంసి డైరెక్టర్ నర్సింహారెడ్డిలు హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ముగ్గులపోటీల్లో గ్రామయువతులు పాల్గొని సంస్కృతీసంప్రదాయాలకు అద్దంపట్టేవిధంగా ముగ్గులువేయడం చాలా సంతోషకరమైన విషయమన్నారు. ఈకార్యక్రమం నిర్వహించిన సమీర్, గ్రామ యువత చెప్యాల రాజశేఖర్‌రెడ్డి, కూరాకుల రమేష్, సత్తయ్య, వై.ప్రమోద్, ఆర్.కిష్టాగౌడ్‌లను అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జంగం రమేష్‌గౌడ్, కరుణాకర్‌రెడ్డి, ఏఎంసి డైరెక్టర్ అమరేందర్‌రెడ్డి, దప్పు గణేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## యువకులు క్రీడలపై ఆసక్తిని పెంచుకోవాలి



క్రికెట్ టోర్నమెంట్ సీజన్7లో విజేతలకు బహుమతులను అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్

**నర్సాపూర్, జనవరి 15, ప్రభాతవార్త:**
గ్రామీణ యువకులందరూ క్రీడలపై ఆసక్తి పెంచుకొని రాణించాలని మెదక్ జిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్ అన్నారు. బుధవారం నర్సాపూర్ మండలం నత్నాయిపల్లి గ్రామంలో గంగురవిస్మారక క్రికెట్ టోర్నమెంట్ సీజన్7 ముగింపు కార్యక్రమం సందర్భంగా విజేతలకు బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమంలో మెదక్‌జిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్య క్షులు ఆంజనేయులుగౌడ్ పాల్గొన్నారు. ఈసందర్భంగా క్రికెట్ పోటీలో గెలిచిన విజేతలకు బహుమతి మరియు ట్రోఫీని అందజేశారు. ఈకార్యక్రమంలో నర్సాపూర్‌మండల అధ్యక్షులు మల్లేష్, నర్సాపూర్‌మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఉదయ్‌కుమార్, నర్సాపూర్ మండలనాయకులు నరేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## హత్నూరలో ఘనంగా ముగిసిన క్రికెట్ పోటీలు

**హత్నూర, జనవరి 15, ప్రభాతవార్త:**
మండలకేంద్రమైన హత్నూరలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని గత ఐదురోజులుగా హత్నూర క్రికెట్ లీగ్3 టోర్నమెంట్ నిర్వహించగ బుధవారం ఘనంగా ముగిసింది. ఐదురోజులపాటు అట్టహాసంగా కొనసాగిన క్రీడా పోటీలలో గ్రామానికి చెందిన 8 టీంల క్రీడాకారులు పాల్గొన్నారు.

## కోలి సమాజాన్ని అన్నిరంగాల్లో తీర్చిదిద్దాలి



యాదగిరిని శాలువాతో సన్మానిస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి

**గజ్వేల్, జనవరి 15 (ప్రభాతవార్త):**
అఖిల భారతీయ కోలి సమాజ్ ఎగ్జిక్యూటీవ్ మెంబర్‌గా గజ్వేల్ పట్టణానికి చెందిన హైకోర్టు న్యాయవాది, నాచగిరి ఆలయ పాలకమండలి మాజీ చైర్మన్ కొట్టాల యాదగిరి నియామకం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవరెడ్డి శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కోలి సమాజ జాతీయ కార్యవర్గంలో యాదగిరికి అవకాశం కల్పించడం ఆయనకు ఉన్న చిత్తశుద్ధి, నిబద్ధత, అంకితభావానికి నిదర్శనమని కొనియాడారు. హైకోర్టు న్యాయవాదిగా, బిఆర్ఎస్ పార్టీ లీగల్‌సెల్ సభ్యునిగా పనిచేసిన యాదగిరి ముదిరాజ్ మరింత ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. జాతీయ స్థాయిలో అట్టడుగున నిలిచిన తన సమాజ అభివృద్ధికి విస్తృత సేవలు అందిస్తూ జాతీయ అధ్యక్షుడు వీరేంద్ర కశ్యప్‌కు అండగా నిలిచి రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా, విద్యాపరంగా కోలి సమాజాన్ని తీర్చిదిద్దాలని వివరించారు.

## చిప్పల్‌తుర్తిలో ప్రీమియర్ లీగ్ వాలీబాల్ పోటీలు



విజేతలకు బహుమతులు అందజేసిన నిర్వాహకులు
గ్రామ మాజీ సర్పంచ్ పులిమామిడి శ్యామల లక్ష్మణ్ గౌడ్ తదితరులు

**నర్సాపూర్, జనవరి 15, ప్రభాతవార్త:**
నర్సాపూర్ మండల పరిధిలోని చెప్పల్‌తుర్తి గ్రామంలో సంక్రాంతి పండగ సంబరాల్లో భాగంగా గ్రామ తాజా మాజీ సర్పంచ్ పులిమామిడి శ్యామల లక్ష్మణ్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రీమియర్ లీగ్ సీజన్2 వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ వాలీబాల్ పోటీలు రెండు రోజులపాటు నిర్వహించగా ఈ వాలీబాల్ పోటీలో మొత్తం ఆరు జట్లు పాల్గొన్నాయి. చివరి రోజు సంక్రాంతి పండగ మంగళవారం నాడు ఈ వాలీబాల్ పోటీలో విజేతలైన విన్నర్ జట్టుకు 5000 రూపాయలు, రన్నర్ జట్టుకు 2500 రూపాయల నగదు బహుమతులు నిర్వాహకులు తాజా మాజీ సర్పంచ్ పులిమామిడి శ్యామల లక్ష్మణ్ గౌడ్ చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా తాజా మాజీ సర్పంచ్ శ్యామల లక్ష్మణ్ గౌడ్ మాట్లాడుతూ గ్రామంలో యువకులను క్రీడలపై ఆసక్తి కలిగేలా ప్రోత్సహించుటకు ఈ వాలీబాల్ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ పోటీల్లో గ్రామ యువకులు ఎంతో ఆసక్తిగా పాల్గొని విజయవంతంగా ముగిసిందని ఆయన తెలిపారు. ఇందుకు సహకరించిన గ్రామస్తులకు యువకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు, యువకులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## చైనా మాంజా తగిలి
## సాఫ్ట్‌వేర్ యువకుడికి తీవ్ర గాయాలు

**ఉప్పల్, జనవరి 15 ప్రభాతవార్త :** ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఒక సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ తలకు చైనా మాంజా తగిలి తీవ్ర గాయాలకు గురైన సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, స్థానికులు కథనం ప్రకారం.. కషాయిగూడ, నాగార్జునకాలనీకి చెందిన దోకపల్లి నారాయణరెడ్డి కుమారుడు దోకపల్లి సంవర్ధన్‌రెడ్డి (29) యుఎస్ఎ కన్సలెంట్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్నాడు. అయితే ఈనెల 15వ తేదిన ఉదయం కుషాయిగూడ నాగార్జునకాలనీనుంచి ఉప్పల్ డిఎస్ఎల్ మాల్‌కు వెళుతుండగా మార్గ మధ్యలో అతని మెడకు చైనా మాంజా తగిలి స్టేడియం మెట్రో స్టేషన్ సమీపంలో పడిపోయాడు. దీంతో అతనిని వెంటనే సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అతడి పరిస్థితి నిలకడగా ఉందని, చికిత్స పొందుతున్నాడని పోలీసులు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## పల్లె నుంచి పట్నం బాట..
## పండగకు ఊరెళ్లిన జనం..మళ్లీ తిరుగుప్రయాణం

**హైదరాబాద్‌కు వచ్చే రహదారులన్నీ కిటకిట**

హైదరాబాద్, జనవరి 15, ప్రభాతవార్త:
తెలుగువారి పెద్ద పండగ సంక్రాంతి ముగిసింది. మూడు రోజుల పండగను ఎంజాయ్ చేసేందుకు పల్లెబాటిన జనంతో తెలంగాణ రాజధాని హైదరాబాద్ బోసిపోయింది. అయితే బుధవారంతో సంక్రాంతి ముగియడంతో ప్రజలు తిరిగి నగరబాట పట్టారు. సాధారణ రోజుల్లో విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వచ్చే వాహనాల రాకపోకలు బుధవారం నుంచే రెట్టింపు స్థాయిలో ఉన్నాయని అధికారులు చెప్తున్నారు. దీంతో యాదాద్రి భువనగిరి జిల్లా పంతంగి టోల్ ప్లాజా వద్ద హైదరాబాద్ మార్గంలో తొమ్మిది టోల్ చెల్లింపు కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. ఫాస్టాగ్ ఫాస్టాగ్ విధానం అమలులో ఉండటంతో వాహనాల రాకపోకలు సాఫీగా సాగుతున్నాయి. గురు, శుక్ర వారాల్లోనూ రద్దీ ఉండొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. మరోవైపు హైవేపై రద్దీ కారణంగా ఎలాంటి ప్రమాదాలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

**గజ్వేల్, జనవరి 15, ప్రభాతవార్త:**
గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీ సింగారం గ్రామానికిచెందిన గూడూరి మల్లేశం అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందడం జరిగింది. ఈవిషయం తెలుసుకున్న సింగారం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాలి రాములు రూ.5వేల ఆర్థికసహాయం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మల్లేశం కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని పేర్కొన్నారు.

## 18వ సారి రక్తదానం చేసిన ఆర్ఎంపి వైద్యుడు

**గజ్వేల్, జనవరి 15, ప్రభాతవార్త:**
గజ్వేల్ పట్టణానికి చెందిన కేతోజి నవ్య డెలివరీ కోసం మెడిసిటి ఆసుపత్రిలో చేరగా ఆమెను పరీక్షించిన వైద్యురాలు రక్తం తక్కువగా ఉందని, బ్లడ్ గ్రూప్ అరుదైన ఓ-నెగటీవ్ అని చెప్పగా అత్యవసరంగా బ్లడ్ ఎక్కించాల్సిన అవసరం ఉందని విషయం తెలుసుకున్న గజ్వేల్ పట్టణానికి చెందిన ఆర్ఎంపి వైద్యుడు అరికెల కరుణాకర్ వెంటనే స్పందించి మెడిసిటి ఆసుపత్రిలో బ్లడ్‌బ్యాంకుకు వెళ్లి 18వసారి రక్తదానం చేయడం జరిగిందన్నారు.

## మానవత్వం చాటుకున్న నాగు ముదిరాజ్

**గజ్వేల్ టౌన్, జనవరి 15, (ప్రభాతవార్త):**
గజ్వేల్ బిజెపి సీనియర్ నాయకుడు నాగు ముదిరాజ్ తమిళనాడు వ్యక్తికి ఆర్థిక సహాయం అందజేసి మానవత్వం చాటుకున్నాడు. ఈ సందర్భంగా నాగు ముదిరాజ్ మాట్లాడుతూ తమిళనాడుకు చెందిన బిజెపి క్రియాశీల కార్యకర్త బోర్ బండిపై పనిచేస్తున్న క్రమంలో బోర్‌బండి నుండి గజ్వేల్ బైపాస్ వదనద రోడ్డుపై వదిలిపెట్టారని తను తమిళనాడు వెళ్లడానికి దారి ఖర్చుల కోసం గజ్వేల్ బిజెపి కార్యాలయానికి రావడం జరిగిందని, వారికి దారి ఖర్చుల నిమిత్తం బిజెపి నాయకులు మనోహర్‌యాదవ్, నాయిని సందీప్, బారు అరవింద్, సురేష్, బండారు మహేష్‌లు కలిసి ఆర్థిక సహాయం అందజేసినట్లు తెలిపారు.

## అల్లాదుర్గంలో ఘనంగా సంక్రాంతి వేడుకలు



అల్లాదుర్గంలో ముగ్గులు వేస్తున్న చినారులు

**అల్లాదుర్గం, జనవరి 15, ప్రభాతవార్త:**
మండలకేంద్రమైన అల్లాదుర్గంతో పాటు మండలంలోని గడిపెద్దాపూర్, ముస్లాపూర్, ముప్పారం, కాయితంపల్లి, చిల్వర్, అప్పాజిపల్లి బహిరన్‌దిబ్బ తదితర గ్రామాల్లో సంక్రాంతి వేడుకలను ఆనందోత్సవాలతో ఘనంగా జరుపుకున్నారు. గ్రామంలోని ఇండ్ల ముందు రంగురంగుల ముగ్గులు వేసి లోగిళ్లను అందంగా ముగ్గులతో అలంకరించారు. సంక్రాంతి పర్వదినాలను పసందుగా జరుపుకున్నారు.

## గెలుపోటములను సమానంగా తీసుకొని క్రీడాస్ఫూర్తిని చాటాలి

**కొమురవెల్లి, జనవరి 15, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని ఐనాపూర్‌లో బుధవారం కొమ్మూరి యువసేన ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రాజు టోర్నమెంట్‌ను ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఐనాపూర్ గ్రామ క్రీడాకారులకు టీ షర్టులను పంపిణీ చేసి మాట్లాడారు. యువత చెడు అలవాట్లకు బానిసై బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దన్నారు. టోర్నమెంట్‌లు గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులలో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీయడానికి ఎంతో మేలు చేస్తాయన్నారు. గెలుపోటములను సమానంగా తీసుకొని క్రీడస్ఫూర్తిని చాటాలన్నారు. కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు దాసరి కళావతి, చెరుకు రమణరెడ్డి, సనాది భాస్కర్, మామిడాల నాగరాజు, దాసరి శ్రీకాంత్, ఎం.డి.రేష్మ, చెరుకు సుమలత, దొమ్మాట అజిత్‌రెడ్డి, స్వామి, మల్లం స్వామి, నీల మధు, తడకపల్లి వంశీ, కొమ్ము రాములు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతో మానసిక ఉల్లాసం, శారీరక దారుఢ్యం

-జగదేవ్‌పూర్ ఎస్ఐ చంద్రమోహన్



టోర్నమెంట్‌లో గెలుపొందిన విజేతలతో ఎస్ఐ చంద్రమోహన్

**జగదేవ్‌పూర్, జనవరి 15, ప్రభాతవార్త:**
క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దారుఢ్యానికి దోహదపడతాయని జగదేవ్‌పూర్ సబ్ ఇన్‌స్పెక్టర్ చంద్రమోహన్ అన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని జగదేవ్‌పూర్ గ్రామ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బుద్ద నాగరాజు ఆర్థిక సహకారంతో గత మూడు రోజులుగా క్రికెట్, వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించగా బుధవారం విజేతలకు ఎస్ఐ చంద్రమోహన్ బహుమతులను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా క్రీడల వైపు మక్కువ చూపి రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడల్లో రాణించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జగదేవ్‌పూర్ మండల మాజీ కో-ఆప్షన్ సభ్యుడు సయ్యద్ ఎక్బాల్, మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు రాగుల రాజు, మాజీ వార్డు సభ్యులు మహేష్ ముదిరాజ్, సత్యం, అలీం, గణేష్, కరుణాకర్, బాల్‌నర్సయ్య, యువకులు శ్రీను, కనకయ్య, భాస్కర్, బాబు, రాజు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడల ద్వారా క్రమశిక్షణ



విజేతలకు బహుమతులను అందిస్తున్న ఎస్ఐ నారాయణగౌడ్

**చిన్నశంకరంపేట, జనవరి 15, ప్రభాతవార్త:**
క్రీడలద్వారా క్రమశిక్షణ అలవడుతుందని చిన్నశంకరంపేట ఎస్ఐ నారాయణగౌడ్ అన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా గవ్వలపల్లిలో గత ఆదివారం నాడు ప్రారంభమైన క్రికెట్, ముగ్గుల పోటీలు బుధవారం నాడు ముగిసాయి. విజేతగా నవీన్‌రెడ్డి జట్టు, రన్నరప్‌గా నాగరాజు జట్టు నిలిచాయి. క్రికెట్, ముగ్గుల పోటీల విజేతలకు ఎస్ఐ నారాయణగౌడ్ బహుమతులను అందించారు.

## క్రీడలు మానసికోల్లాసాన్నిస్తాయి

**నర్సాపూర్ రూరల్, జనవరి 15, ప్రభాతవార్త:**
క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం వస్తుందని మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ అన్నారు. మండల పరిధి నత్నాయిపల్లి గ్రామంలో గంగు రవి స్మారక క్రికెట్ టోర్నమెంట్ సీజన్-7లో పాల్గొని విజేతలకు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ మండల అధ్యక్షులు మల్లేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఉదయ్ కుమార్, మండల నాయకులు నరేష్, తదితరులు పాల్గొన్నారు.

## నాయి బ్రాహ్మణులకు ఉచిత కంటి వైద్యశిబిరం



నారాయణఖేడ్‌లో మాట్లాడుతున్న నాయి బ్రాహ్మణులు

**నారాయణఖేడ్, జనవరి 15, ప్రభాతవార్త:**
లయన్స్ క్లబ్ వారి సహకారంతో నాయి బ్రాహ్మణులకు ఈనెల 18వ తేదిన ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు నాయి బ్రాహ్మణుల ఉమ్మడిమెదక్ జిల్లా అధ్యక్షులు నరేందర్ ఒకప్రకటనలో తెలిపారు. బుధవారం ఆయన నారాయణఖేడ్‌లో నాయి బ్రాహ్మణుల సమావేశంలో మాట్లాడుతూ నారాయణఖేడ్ పట్టణంలోని సాయిబాబా దేవాలయ ఆవరణలో ప్రత్యేకంగా నాయి బ్రాహ్మణుల కుటుంబీలకు ఉచిత కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈశిబిరంలో కంటి వైద్యులచే పరీక్షలు నిర్వహించి అవసరమైనవారికి కళ్లద్దాలు, మందులు అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్ కూడా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. శనివారం ఉదయం పదిగంటలనుంచి సాయంత్రం నాలుగుగంటలవరకు ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించడం జరుగుతుందన్నారు. శిబిరానికి వచ్చే వారు తమ ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీని తెచ్చుకోవాలని అన్నారు. నారాయణఖేడ్‌నియోజకవర్గంలోని నాయి బ్రాహ్మణుల కులసోదరులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. మిగతావివరాలకు సెల్‌నెం.9440365907, 9640451989 నెంబర్లకు సంప్రతించాలని అన్నారు. ఈకార్యక్రమంలో నాయిబ్రాహ్మణులు తదితరులు పాల్గొన్నారు.

## క్రికెట్ టోర్నీ విజేతలకు బహుమతుల ప్రదానం



విజేతలకు బహుమతులు బహుకరిస్తున్న దృశ్యం

**చిన్నకోడూరు, జనవరి 15, ప్రభాతవార్త:**
చిన్నకోడూరు మండలపరిధిలోని చంద్లాపూర్ గ్రామంలో ప్రతియేటా స్వర్గీయ ఎస్.మల్లయ్యగౌడ్‌నజ్ఞాపకార్థం నిర్వహించే క్రికెట్ టోర్నీ విజయవంతంగా ముగిసినట్లు నిర్వాహకులు తెలిపారు. టోర్నీలో 16టీంలు పాల్గొన్నాయని తెలిపారు. విన్నర్‌కుకప్‌తో పాటు రూ.10116 నగదు, రన్నర్‌కు రూ.5116 నగదు బెస్ట్‌బౌలర్, బెస్ట్‌బ్యాట్స్‌మెన్, ప్రతిమ్యాచ్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌ను దాత సూరగోని శ్రీనివాస్‌గౌడ్ అందించారు. టోర్నీ విజయవంతంగా నిర్వహించడానికి సహకరించిన మాజీసర్పంచ్ సూరగోని చంద్రకళ రవిగౌడ్, ఆర్గనైజర్స్, క్రీడాకారులకు, గ్రామపెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.

## వరసిద్ధి వినాయక 225వ జయంతి ఉత్సవం

**-హాజరుకానున్న మాధవానంద సరస్వతి, ఎంపి, ఎమ్మెల్యే**

**న్యాల్‌కల్, జనవరి 15, ప్రభాతవార్త:**
కోరిన కోరికలు తీరుస్తూ భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతూ నిత్య పూజలందుకుంటున్న స్వయంభూ వరసిద్ధి వినాయకుడు 225వ జయంతి ఉత్సవాలకు ముస్తాబయ్యాడు. మండలపరిధిలోని హద్నూర్‌గ్రామంలో 224సంవత్సరాల క్రితం స్వయంభూగా కొలువుదీరిన వరసిద్ధి వినాయకుడు ప్రతినిత్యంతోపాటు ప్రతినెల పౌర్ణమి అనంతరం మూడవరోజున నిర్వహించే సంకష్టహరచతుర్థి పర్వదినం రోజున ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు ప్రసాదవితరణ చేస్తూ వస్తున్నారు.

**-పెరుగుతున్న విగ్రహ పరిమాణం...**

ఆలయంలో స్వయంభూగా కొలువుదీరిన వరసిద్ధి వినాయకుడి విగ్రహ పరిమాణం పెరుగుతోందని భక్తులు అంటున్నారు. భక్తిశ్రద్ధలతో స్వామి వారిని పూజిస్తే తమ కోరికలను తీరుస్తూ వరసిద్ధి వినాయకుడు వరాలను ప్రసాదిస్తున్నాడని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఆలయంలో కొలువుదీరిన విగ్రహం అప్పట్లో చిన్న పరిమాణంలో ఉండేదని, నేడు విగ్రహ పరిమాణం పెరగిందని భక్తులు పేర్కొంటున్నారు.

**-పూజా కార్యక్రమాలు-ప్రముఖుల రాక...**

ఈనెల 17న ఆలయంలో స్వామివారి 225వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయానికి రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతి, ఝరాసంగంమండలం బర్దీపూర్ దత్తగిరి ఆశ్రమపీఠాధిపతి అవదూతగిరిమహారాజ్ (అప్పగారు), జహీరాబాద్ ఎంపి సురేశ్‌కుమార్‌శెట్కార్, ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు తదితర ప్రముఖులు హాజరవుతున్నట్లు సమాచారం. జయంతి ఉత్సవాలకు ఆయా ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకుని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

## గంగోజిపేటలో ఘనంగా సంక్రాంతి వేడుకలు



విన్నర్ జట్టుకు ట్రోఫీని అందచేస్తున్న దృశ్యం

**పుల్‌కల్, జనవరి 15, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని గంగోజిపేటలో సంక్రాంతిని పురస్కరించుకుని జిల్లా ఎస్టీ,ఎస్సీ అట్రాసిటి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కాశపాగ ఇమ్మయ్య ఆధ్వర్యంలో వాలీబాల్‌పోటీలు నిర్వహించారు.
ఈసందర్భంగా ఇమ్మయ్య మాట్లాడుతూ యువత క్రీడలపై ప్రత్యేక దృష్టిని సారించాలని, క్రీడలతో కలిగే ప్రయోజనాలను వివరించారు. క్రీడాపోటీల్లో ఎస్‌సి, బిసి, మైనార్టీ యువకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. క్రికెట్ పోటీల్లో కుమ్మరి ప్రశాంత్ టీం టోర్నీ కప్‌ను కైవసం చేసుకోగా షేక్ వాసీఫ్ బృందం రన్నర్‌గా నిలిచింది. విజేత జట్టుకు ఇమ్మయ్య బహుమతులు అందించి అభినందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బాలాగౌడ్ మాజీ విద్యా కమిటీ చైర్మన్ కుమ్మరి అశోక్, డీలర్ గంగాధరి ప్రసాద్, గ్రామస్థులు యూసుఫ్ కుమ్మరి శ్రీకాంత్, శివరాజ్, ముత్యాలు పాల్గొన్నారు.

## శంభు దేవుని క్యాలెండర్ ఆవిష్కరణ

**కొండపాక, జనవరి 15, ప్రభాతవార్త**
శ్రీ స్వయంభూ శంభు దేవాలయం ట్రస్ట్ అధ్వర్యంలో బుధవారం శంభు దేవుని క్యాలెండర్‌ను దేవాలయం ట్రస్ట్ చైర్మన్ మంచాల శ్రీనివాస్ చేతుల మిదుగా అవిష్కరించారు. ఈసందర్బంగా అయన మాట్లాడుతూ క్యాలెండర్‌లో కచ్చితత్వంతో తిథి, నక్షత్రాలను పొందుపరిచినట్లు తెలిపారు. అంతే కాకుండా ఈనెల 24,25,26 తేదీల్లో జరగబోయే శంభు దేవాలయం వార్షిక బ్రహోత్సవంకోసం అన్ని ఏర్పాట్లను చేయడం జరిగిందని తెలిపారు. ఉత్సవంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులుకావాలని కోరారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రధానకార్యదరి ్శ పెద్దంకుల శ్రీనివాస్‌గౌడ్, కోశాధికారి వడ్లకొండ శ్రీనివాస్, ట్రస్ట్ సభ్యులు పెద్ది కుమారస్వామి, మంచాల కృష్ణమూర్తి, నూనె కుమార్, మంచాల చిన్న శ్రీనివాస్, పబ్బోజు రాజయ్య, దేశాయిరెడ్డి పాల్గొన్నారు.

# వడ్డిలో ప్రారంభమైన 25వ పాతపంటల జాతర

**-చిరుధాన్యాల ఆహారంతో ఆరోగ్యం పదిలం**
**-హాజరైన శాస్త్రవేత్తలు, అధికారులు, నాయకులు**




వడ్డిలో 25వ పాతపంటల జాతరను ప్రారంభిస్తున్న అధికారులు, నాయకులు, డిడిఎస్ మహిళాసంఘాలు

**న్యాల్‌కల్, జనవరి 15, ప్రభాతవార్త:**
చిరుధాన్యాల ఆహారంతో ప్రజల ఆరోగ్యం పదిలంగా ఉంటుందని వక్తలు సూచించారు. డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ (డిడిఎస్) ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం సంక్రాంతి పర్వదినాన ప్రారంభించే పాతపంటల జాతరను మండలపరిధిలోని వడ్డి గ్రామంలో అధికారులు, శాస్త్రవేత్తలు, రూరల్ సిఐ, డిడిఎస్ మహిళాసంఘాలు, ఎఎంసి వైస్‌చైర్మన్, నాయకులు ప్రారంభించారు. పాత విత్తనాలతో అందంగా అలంకరించిన ఎడ్లబండ్ల ఊరేగింపుతో వడ్డిగ్రామం సందడిగా మారింది. జ్యోతి ప్రజ్వలన చేసి జాతరను ప్రారంభించారు. జీవవైవిధ్య సంరక్షకులైన వడ్డి గ్రామానికిచెందిన నడిమిదొడ్డి శోభమ్మను హైద్రాబాద్‌లోని అటారి జోన్ 10 ఐసిఎఆర్ డైరెక్టర్ డాక్టర్ షేక్ ఎన్ మీరా, ఎల్గోయి గ్రామానికి చెందిన ఎర్ర నర్సమ్మను పద్మశ్రీ అవార్డు గ్రహీత, హైద్రాబాద్‌లోని నిమ్స్ వైద్యనిపుణులు డాక్టర్ ప్రసాద్‌రావు, కాశీంపూర్ గ్రామానికిచెందిన లచ్చమ్మను జహీరాబాద్ రూరల్ సిఐ జెక్కుల హనుమంతు, అల్గోల్ గ్రామానికిచెందిన మేతరి అనిషమ్మను బసంత్‌పూర్‌లోని వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ్‌కుమార్, పొట్‌పల్లికి చెందిన రత్నమ్మను సాక్షి దినపత్రిక జర్నలిస్ట్ పతంగి రాంబాబులు శాలువాలతో సత్కరించి అభినందించారు. హార్వెస్ట్ హెవెన్-సీడ్స్ ఆఫ్ డైవర్సిటీ పుస్తకాన్ని అతిథులు ఆవిష్కరించారు. ఈసందర్భంగా మండల ఉత్తమ రైతు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బిరేదార్ శ్రీనివాస్‌రెడ్డి, మెటల్‌కుంట మాజీ సర్పంచ్, జహీరాబాద్ మార్కెట్‌కమిటీ వైస్‌చైర్మన్ గుండం గారి తిరుపతిరెడ్డి, మాజీ ఎంపిపి అధ్యక్షులు, ప్లాంట్ జినోమ్ సేవియర్ అవార్డు గ్రహీత ఎన్ అంజమ్మ, మాజీ వైస్‌ఎంపిపి గౌసోద్దిన్, ఎంపిడిఓ కవలాస్ రాజశేఖర్, రైతు స్వరాజ్‌వేదిక, సామాజిక కార్యకర్త ఉషా సీతాలక్ష్మిలు మాట్లాడుతూ పాత పంటల సంరక్షణకు డిడిఎస్ చేస్తున్న కృషిని అభినందించారు. డిడిఎస్ గత 25సంవత్సరాలుగా చేస్తున్న కృషి ఫలితంగానే నేడు ప్రజలు (పల్లెలు, నగరాలు, పట్టణాలు) పాతపంటల భోజనానికి ఆరాటపడుతున్నారని గుర్తుచేశారు. పాత పంటల ఆహారంలో ప్రజలు ఆసుపత్రులకు దూరంగా ఉండే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. గ్రామాల్లోని ప్రతిరైతు తమకు ఉన్న వ్యవసాయభూమిలో కొంతమేర అయినా పాత పంటలను పండించుకోవాలన్నారు. అంతకు ముందు గ్రామానికి చేరుకున్న ఎడ్లబండ్లకు అతిథులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

## ఘనపూర్ ఆయకట్టకు సింగూరు జలాలు

**-0.35 టిఎంసి జలాల విడుదలకు ఉత్తర్వులు**



ఘనపూర్ ఆయకట్టుకు సింగూరు జలాలు వదులుతున్న దృశ్యం

**పుల్‌కల్, జనవరి 15, ప్రభాతవార్త:**
ఘనపురం ఆయకట్టు పరిరక్షణకు సింగూరు ప్రాజెక్టు నుంచి 0.35 టీఎంసిల జలాలను మొదటివిడతగా విడుదల చేసేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. యాసంగి సీజన్‌లో ఘనపురం ఆయకట్టు కింద రైతులు వరిపంట సాగుచేస్తుండటంతో అందుకు అవసరమైన సాగునీటిని సింగూరు ప్రాజెక్టునుంచి బుధవారం విడుదలచేశారు. ప్రాజెక్టుకు దిగువన ఉన్న మంజీరరిజర్వాయర్‌కు ముందుగా జలాలను విడుదలచేయనున్నారు. ప్రాజెక్టుకు ఎడమవైపున నిర్మించిన జలవిద్యుత్ కేంద్రంలో 75మెగావాట్ల సామర్థ్యంగల రెండుటర్బైన్ల ద్వారా 0.35 టీఎంసీల జలాలను విడుదల చేశారు. జెన్‌కో ద్వారా అవుట్ ఫ్లో 2842 క్యూసెక్కుల జలాలు దిగువకు విడుదలవుతున్నాయి. 0.35 టీఎంసిల జలాలు విడుదల పూర్తికాగానే జల విద్యుత్ గేట్ల ద్వారా నీటిని విడుదల నిలిపివేస్తామని ప్రాజెక్టు డీఈఈ నాగరాజు, ఏఈఈ మహిపాల్‌రెడ్డిలు తెలిపారు. మంజీర రిజర్వాయర్‌నుంచి ఘనపురం ఆయకట్టుకు గురువార, శుక్రవారాల్లో జలాలను విడుదల చేసే అవకాశం ఉంది. యాసంగి సీజన్ వరిపంట కోతకువచ్చేవరకు విడతల వారీగా నీటిని విడుదల చేస్తూ ఉంటారు. నీటి విడుదల దృష్ట్యా మంజీరా నదీపరివాహక ప్రాంతానికి వెళ్లకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. పశువుల,గొర్రెల కాపరులు, చేపలవేటకు వెళ్లే మత్స్యకారులు, రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

## మరమ్మతులకు నిధులు మంజూరు చేయండి

**-మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి**



ఎంచె రోడ్డును పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి

**పాపన్నపేట, జనవరి 15, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని కుర్తివాడ మందిరం నుంచి దేవునిపల్లి (ఎంచె) వరకు పాడైన రోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి కోరారు. బుధవారం స్థానిక రైతులతో కలిసి ఎంచె రోడ్డును పరిశీలించారు. ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 2005లో తను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో రైతుల వినతి మేరకు 900ఎకరాల పొలాలకు ఉపయోగపడే రోడ్డు మంజూరు చేయించానన్నారు. ప్రస్తుతం ఆరోడ్డు శిథిలావస్థలో ఉండటంతో రైతులు తమ వ్యవసాయ పొలాలకు వెళ్లేందుకు పాట్లు పడుతున్నారని విచారం వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి శిథిలావస్థలో ఉన్న రోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని శశిధర్‌రెడ్డి సూచించారు. కార్యక్రమంలో రైతులు అంబీర్ మోహన్, కుమ్మరి బ్రహ్మం, మన్నె వెంకటేశం, సంగన్నగారి సిద్దిరెడ్డి తదితరులు ఉన్నారు.

## సంక్రాంతికి ముస్తాబైన దుర్గభవానీమాత

**పాపన్నపేట, జనవరి 15, ప్రభాతవార్త:**
సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం ఏడుపాయల వన దుర్గాభవానీమాతను ప్రత్యేకంగా అలంకరించారు. పండుగ ప్రాశస్త్యాన్ని ప్రతిబింబించేలా అమ్మవారిని అలంకరించారు. దుర్గమ్మ ముందు గంగిరెద్దు, గాలిపటాలు, చెరుకుగడలు, హరిదాసు, భోగిమంటలతో ప్రత్యేకంగా అలంకరించారు. సంక్రాంతి పర్వదినాలను పురస్కరించుకుని ఆయాప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో ఆలయానికి చేరుకుని ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం సైతం ఆలయానికి భక్తులు చేరుకుని తమ మొక్కులు చెల్లించుకున్నారు.

## ఘనంగా సంక్రాంతి వేడుకలు



లక్ష్మీనగర్‌లో గ్రామ పుట్టిన రోజు కేకును కట్ చేస్తున్న గ్రామస్థులు

**పాపన్నపేట, జనవరి 15, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన పాపన్నపేటతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో మూడు రోజులు (భోగి, మకరసంక్రాంతి, కనుమ) సంక్రాంతి సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. మండల పరిధిలోని లక్ష్మీనగర్‌లో గ్రామ పుట్టిన రోజును పురస్కరించుకుని కేక్‌కట్‌చేసి నోటిని తీపిచేసుకున్నారు. సంక్రాంతి పర్వదినాలను పురస్కరించుకుని గ్రామాల్లో ఆటలపోటీలు రసవత్తరంగా కొనసాగాయి. క్రీడల్లో ప్రతిభచాటిన క్రీడాకారులకు బహుమతులు అందచేశారు.

## వాలీబాల్ విజేతలకు బహుమతులు



గెలుపొందిన వాలీబాల్ జట్టుతో గడిపెద్దాపూర్ గ్రామస్థులు

**అల్లాదుర్గం, జనవరి 15, ప్రభాతవార్త:**
సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలపరిధిలోని గడిపెద్దాపూర్‌లో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. క్రీడల్లో 10జట్లు పోటీపడగా పోటీలు రెండురోజులపాటు కొనాగాయి. గడిపెద్దాపూర్ జట్టు విజేతగా నిలచింది. పోటీల్లో ప్రతిభచాటిన క్రీడాజట్టుకు గ్రామయువకులు బహుమతులు అందించి, అభినందించారు. కార్యక్రమంలో గ్రామప్రముఖులు జోగినాథ్, విఠల్‌రెడ్డి, దుర్గారెడ్డి, సాయిప్రసాద్, కృష్ణగౌడ్, రజనీకాంత్, సాయికిరణ్, ప్రభాకర్, సత్యనారాయణ, సాయిలు, కిష్టయ్య, రవి, నరసింహులు, ఆయా గ్రామాల క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## మనూర్‌లో సంక్రాంతి వేడుకలు

**మనూర్, జనవరి 15, ప్రభాతవార్త:**
మండలకేంద్రమైన మనూర్‌తోపాటు మండలంలోని ఆయాగ్రామాల్లో మూడు రోజులపాటు సంక్రాంతివేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధలతో ఆనందోత్సాహాలతో ఘనంగా జరుపుకున్నారు. మహిళలు తమ ఇళ్లముందు రంగురంగులముగ్గులు వేయగా బాలురు గాలిపటాలను ఎగరేసి సంబరాలు చేసుకున్నారు. ఆయా గ్రామాల్లో సంక్రాంతి పండుగను ఘనంగా జరుపుకున్నారు.

# రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలు విధిగా పాటించాలి




రంగనాయకసాగర్ ప్రాజెక్టు వద్ద అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ బాలకృష్ణ



నంగునూర్‌లో అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ ఆసిఫ్

**సిద్ధిపేట అర్బన్, జనవరి 15, ప్రభాతవార్త:**
జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలలో భాగంగా బుధవారం సిద్ధిపేట ట్రాఫిక్ ఎస్ఐ గోపాల్‌రెడ్డి పాత, కొత్తబస్టాండు ఆవరణలో ఆటోడ్రైవర్లకు ట్రాఫిక్, రోడ్డు నిబంధలనపై అవగాహన కల్పించారు.

**చిన్నకోడూరులో..**

చిన్నకోడూరు మండలపరిధిలోని రంగనాయకసాగర్ ప్రాజెక్టువద్ద ఎస్ఐ బాలకృష్ణ వాహనదారులకు, యువకులకు ట్రాఫిక్, రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్, రోడ్డు నిబంధనలు పాటించాలన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ మద్యంసేవించి వాహనాలునడపడం నేరమన్నారు. వాహనంనడిపే సమయంలో కాగితాలను వెంట తెచ్చుకోవాలన్నారు.

**వన్‌టౌన్ పరిధిలో..**

సిద్ధిపేట జిల్లా కేంద్రంలోని వన్‌టౌన్ పరిధిలోని ముస్తాబాద్ చౌరస్తా వద్ద ఎస్ఐ కొమురయ్య వాహనదారులకు, ప్రజలకు ట్రాఫిక్, రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. త్రిబుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్ చేయొద్దన్నారు.

**టూ టౌన్ పరిధిలో..**

సిద్ధిపేట జిల్లా కేంద్రంలోని టూ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని వేములవాడ కమాన్ వద్ద ఎస్ఐ రాజేశం వాహనదారులకు, ప్రజలకు ట్రాఫిక్, రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు.

**నంగునూర్‌లో..**

నంగునూర్ మండల కేంద్రంలో ఎస్ఐ అసిఫ్ ఆధ్వర్యంలో వాహనదారులకు, యువకులకు ట్రాఫిక్, రోడ్డు నిబంధనలపై అందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు.

## అంబరాన్నంటిన సంక్రాంతి సంబరాలు



పుల్‌కల్‌లో గాలిపటాలను విక్రయిస్తున్న వ్యాపారి

**పుల్‌కల్, జనవరి 15, ప్రభాతవార్త:**
ఊరు, వాడ, ప్రతి ఇల్లు సంక్రాంతి పర్వదినాలను పురస్కరించుకుని సందడిగా మారాయి. గ్రామాల్లో పర్వదినం సంబరాలు మిన్నంటాయి. ఉమ్మడి పుల్‌కల్ మండలంలోని ఆయా గ్రామాల్లో సందడి నెలకొంది. గ్రామంలోని ప్రతి ఇల్లు, ఇంటి పరిసరాలు రంగురంగుల ముగ్గులతో చూడముచ్చటగా కనువిందు చేశాయి. యువకులు పతంగులు ఎగరేస్తూ ఆనందంగా సంబరాలు చేసుకున్నారు. గ్రామాల్లో యువత క్రీడా పోటీల్లో తలపడి ఉత్సాహంగా పండగరోజులను పసందుగా జరుపుకున్నారు. ఉమ్మడి పుల్‌కల్ మండలంలోని చక్రియాల, గొంగ్లూరు, గంగోజిపేట, సింగూరు, ముదిమాణిక్యం తదితర గ్రామాల్లో క్రీడా పోటీలు (వాలీబాల్, క్రికెట్, కబడ్డి, ఖో-ఖో) రసవత్తరంగా సాగాయి. గంగోజిపేటలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి విజిలెన్స్ మానిటరింగ్ కమిటి సభ్యులు కాశపాగ ఇమ్మయ్య ఆధ్వర్యంలో వాలీబాల్, గంగ్లూర్‌లో రజక సంఘం మండల అధ్యక్షులు నర్సింలు ఆధ్వర్యంలో గొంగ్లూర్ ప్రిమియర్ లీగ్ పేరుతో క్రికెట్ పోటీలను, చక్రియాల్‌లో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిన్నరొల్లపాటి రాజశేఖర్ ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలను, సింగూరు గ్రామంలో మాజీ ఉపసర్పంచ్ నందికంది శ్రీనివాస్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో క్రికెట్‌పోటీలను నిర్వహించి పోటీల్లో ప్రతిభచాటిన క్రీడాకారులకు, జట్లకు బహుమతులు అందచేశారు.

## సంక్రాంతి వేడుకల్లో ఎస్ఐ దంపతులు



ముగ్గుల పోటీ విజేతకు బహుమతులు అందచేస్తున్న ఎస్ఐ

**పుల్‌కల్, జనవరి 15, ప్రభాతవార్త:**
మండలంలోని కోదూర్ గ్రామంలో నిర్వహించిన సంక్రాంతి వేడుకలను గ్రామస్థులు ఆనందోత్సవాలతో ఘనంగా జరుపుకున్నారు. గ్రామంలో నిర్వహించిన ముగ్గులపోటీల్లో మహిళలు, బాలికలు పాల్గొని ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. ముగ్గులపోటీల్లో ప్రతిభచాటినవారికి, పోటల్లో పాల్గొన్నవారికి బహుమతులు అందచేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర నాయకులు బ్రహ్మానందం, పుల్‌కల్ ఎస్ఐ క్రాంతికుమార్‌పాటిల్ దంపతులు హాజరై పండగ ప్రత్యేకతను వివరించారు. కార్యక్రమంలో భజరంగ్‌దళ్‌బాధ్యులు సుభాష్ చంద్ర, గ్రామ మాజీసర్పంచ్ భూమిరెడ్డి, గ్రామ ప్రముఖులు శ్యామయ్య, యువకులు శంకర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

## ముగిసిన కెపిఎల్ క్రికెట్ పోటీలు



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న దృశ్యం

**రామాయంపేట మున్సిపాలిటీ, జనవరి 15, ప్రభాతవార్త:**
రామాయంపేటమండలం కాట్రియాలగ్రామంలో నిర్వహించిన కెపిఎల్ (కాట్రియాల ప్రీమియర్ లీగ్) క్రికెట్‌పోటీలు బుధవారం ముగిసాయి. సంక్రాంతిసందర్భంగా గ్రామ మాజీ ఉపసర్పంచ్ కొత్త స్రవంతి రాజేందర్ ఆధ్వర్యంలో మూడురోజులపాటు నిర్వహించిన ఈటోర్నీలో పలుజట్లు పాల్గొని, పోటాపోటీగా తలపడ్డాయి. చివరిగా బుధవారం జరిగిన ఫైనల్ పోరులో రేసింగ్ ఛాంపియన్ జట్టు విజయంసాధించి ట్రోఫీ చేజిక్కించుకుంది. విజేతలకు నిర్వాహకులు ట్రోఫీ అందజేశారు.

## ఘనంగా సంక్రాంతి పంచవటి నోములు



సంక్రాంతి పంచవటి నోములు నిర్వహిస్తున్న మహిళలు

**రామాయంపేట, జనవరి 15, ప్రభాతవార్త:**
సంక్రాంతి పర్వదినం సందర్భంగా రామాయంపేట పట్టణంలోని ఆర్యవైశ్య భవనంలో పంచవటి నోములను మహిళలు ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్యవైశ్య మహిళాసంఘం ఆధ్వర్యంలో ఈకార్యక్రమం జరిగింది. రామాయంపేట చుట్టుపక్కల గ్రామాలనుంచి పెద్ద సంఖ్యలో మహిళలు హాజరయ్యారు. భక్తిశ్రద్ధలతో అమ్మవారికి ఐదు రకాలుగా పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలు ఎనిశెట్టి శ్రీవాణి అశోక్‌గుప్తా, ప్రధాన కార్యదర్శి బొమ్మర్ల లావణ్య శేఖర్, కోశాధికారి గుండు శ్యామల సత్యనారాయణ, కొండూరి మౌలిక సతీష్, ఎర్రం మానస శ్రీనివాస్, వైశ్యసంఘం మండల అధ్యక్షులు పబ్బ సత్యనారాయణ, మాజీ మండల అధ్యక్షులు సూదం మల్లేశం, పట్టణ కార్యదర్శి పల్లెర్ల రమేష్, కోశాధికారి గుండు సత్యనారాయణ, పిఆర్‌ఓ కాసం రాజు, కొత్త శ్రీనివాస్, చొల్లేటి సంతోష్, తోట శ్రీనివాస్ పాల్గొన్నారు.

## గ్రామగ్రామాన సంక్రాంతి సంబరాలు

**నాగల్‌గిద్ద, జనవరి 15, ప్రభాతవార్త:**
మండలకేంద్రమైన నాగల్‌గిద్దతోపాటు మండలంలోని ఆయా గ్రామాల్లో మూడురోజులపాటు సంక్రాంతిసంబరాలను హుషారుగా ఆనందోత్సాహాలతో ఘనంగా జరుపుకున్నారు. ఇళ్లముందు మహిళలు, యువతులు, బాలికలు రంగురంగుల ముగ్గులువేసి నేలను అందంగా ముస్తాబు చేశారు. బాలురు, యువకులు గాలిపటాలను ఎగరేస్తూ నింగికి అందం తెచ్చారు. ఇండ్లలో పిండి వంటకాలు చేసి కుటుంబ సభ్యులు, అల్లుళ్లతో భోజనాలు చేశారు. గ్రామాల నుంచి పట్టణ ప్రాంతాలకు వలస వెళ్లిన వారు, అత్తారింటికి వెళ్లిన ఆడపడుచులు, పిల్లాపాపలతో స్వగ్రామాలకు చేరుకోవడంతో గ్రామాలు సందడిగా మారాయి.